**విలేఖరులు కావలెను**



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా టుడే తెలంగాణ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లు కావలెను. అనుభవం ఆసక్తి గలవారు సంప్రదించండి

**98665 32777**

todaytelangananews6@gmail.com
www.todaytelangananews.com



**TO-DAY TELANGANA** Telugu News Paper

# టుడే తెలంగాణ

తెలుగు దినపత్రిక — నిజం మా నైజం

సంపుటి: 3 సంచిక: 135 www.todaytelangananews.com తెలంగాణ / ఆంధ్ర ప్రదేశ్ శుక్రవారం, ఫిబ్రవరి 13 2026 పేజీలు: 8 వెల: రూ. 5/-

Published from , Suryapet, Nalgonda, Khammam, Bhadradri Kothagudem, Hyderabad, Ranga reddy, Nizamabad, Adilabad ,


పంచాంగం - 13 ఫిబ్రవరి 2026 - శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం
ఉత్తరాయణం - శిశిర ఋతువు
మాఘ మాసం - కృష్ణపక్షం
సూర్యోదయం - ఉ. 6:48
సూర్యాస్తమయం - సా. 6:12
తిథి - అష్టమి ఉ. 7:27 వరకు తరువాత నవమి
సంస్కృత వారం - భౌమ వాసరః
నక్షత్రం - విశాఖ ఉ. 7:49 వరకు తరువాత అనురాధ
యోగం - ధ్రువ రా. 1:38ం వరకు
కరణం - కౌలవ ఉ. 7:27 వరకు, కౌలవ ఉ. 7:27 వరకు
వర్జ్యం - మ. 12:25 నుండి మ. 2:13 వరకు
దుర్ముహూర్తం - ఉ. 9:05 నుండి ఉ. 9:50 వరకు, రా. 11:14 నుండి రా. 12:04 వరకు
రాహుకాలం - మ. 3:21 నుండి సా. 4:46 వరకు
యమగండం - ఉ. 9:39 నుండి ఉ. 11:05 వరకు
గుళికాకాలం - మ. 12:30 నుండి మ. 1:55 వరకు
బ్రహ్మ ముహూర్తం - తె. 5:12 నుండి ఉ. 6:00 వరకు
అమృత ఘడియలు - రా. 11:11 నుండి రా. 12:59 వరకు అభిజిత్ ముహూర్తం - మ. 12:07 నుండి మ. 12:53 వరకు



## రాబోయే పదిన్నరేళ్ల పాటు

# నేనే సీఎం

● 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు ● అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ● నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది ● ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తా ● నా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ అనేది లేదు ● కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్‌ట్యాపింగ్ కేసు సీబీఐకి... ● నిబంధనల ప్రకారమే సింగరేణి టెండర్లు ● ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో రేవంత్ రెడ్డి


**న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 :** 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఆయన వెల్లడించారు. నూటికి నూరు శాతం తన ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చిందని, హైదరాబాద్ నగరాన్ని బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రికి ఇచ్చామన్నారు. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టునకు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడించారు. అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టితీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తానని తెలిపారు. 2018లో తెచ్చిన నిబంధనల ప్రకారమే సింగరేణిలో టెండర్లు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతానన్నారు. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. సింగరేణి సంస్థ అప్పులు తమ హయాంలో పెరగలేదన్నారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. సింగరేణి విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. మొత్తగా ఉన్నానని తనను మాత్రమే ఆయన ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు."2029

మిగతా2లో...

## నేడే మున్సి'పోల్' ఎన్నికల

# ఫలితాలు

- ఎవరికి ఎన్ని స్థానాలు
- ఫలితాలపై అభ్యర్థులలో ఉత్కంఠ
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు
- ఎక్కడా తగ్గకుండా పెద్ద ఎత్తున ప్రచారాలు
- నేడే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేసిన ఈసీ
- ఉదయం 8 గంటల నుంచి జరగనున్న లెక్కింపు




వివరాలు 2లో

## చంద్రబాబు, లోకేశ్‌ను

# కలిసిన బండ్ల గణేశ




**అమరావతి,ఫిబ్రవరి 12 :** సినీ నిర్మాత బండ్ల గణేశ్ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తాను మొక్కుకున్న మొక్కును ఇటీవల తిరుమలకు పాదయాత్రగా వెళ్లి చెల్లించుకున్న నేపథ్యంలో, ఈ భేటీ జరిగింది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్, ఆయనకు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు బండ్ల గణేశ్ ఒక సంకల్పం తీసుకున్నారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై, తిరిగి ముఖ్యమంత్రి అయితే తిరుమలకు నడిచి వస్తానని మిగతా2లో...

## ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది

# గులాబీ జెండాయే


**శేరిలింగంపల్లి నేతలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని

మిగతా2లో...

## సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి మిగతా2లో...

## మామునూరు ఎయిర్‌పోర్టు పనులు

# ప్రారంభించండి

- తెలంగాణ ఎయిర్‌పోర్టులకు అనుమతులు ఇవ్వండి
- కేంద్రమంత్రి రామ్మోహన్‌కు సిఎం రేవంత్ వినతి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12 :** వరం గల్ మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్ పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమ తులు, సహాయం కోరారు. భేటీలో మామూ నూరు , కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలా బాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి.

మిగతా2లో...

## తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా...

● ఉద్యమకారులకు అన్యాయం జరిగింది ● ఊహించిన దానికి భిన్నంగా నిర్ణయాలు ● అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది ● కోదండరామ్ లాంటి వారు ఆలోచన చేయాలి ● తన పక్కన పైరవీకారులు లేరన్న కవిత



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమ కారులే ఉన్నారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు కవిత. గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ మిగతా2లో...

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# రాబోయే పదిన్నరేళ్ల పాటు నేనే సీఎం

(మొదటి పేజీ తరువాయి)

ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్రమంత్రికి ఇచ్చాము. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు సమీపంలో 500–700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని తెలిపారు. తన ప్రభుత్వంలో నూటికి నూరు శాతం ఫోన్‌ట్యాపింగ్ లేదని రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రజల అభిప్రాయాన్ని మాత్రమే తెలుసుకుంటానని ఆయన తెలిపారు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం తనకు అవసరం లేదని వివరించారు. ఎస్ఐబీ ఫిర్యాదుతోనే కేసు దర్యాప్తు జరుగుతోందని వివరించారు. ఎస్ఐబీలో పరికరాల మాయంతోనే కేసు బయటపడిందన్నారు. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు లేరని రేవంత్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖరాసి 6 నెలవుతుందని, కేంద్రం ఇంతవరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తామని ఆయన వెల్లడించారు. రాబోయే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, తనకు రాష్ట్రంలో ఎవరూ పోటీ లేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, ప్రతిపక్షాల్లో కూడా తనకు పోటీ ఇచ్చే నాయకుడు లేడని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బీఆర్ఎస్ నేతల విమర్శలపై స్పందిస్తూ, తనను విమర్శించిన వారికే తాను సమాధానం ఇస్తున్నానని, ఎవరిపైనా వ్యక్తిగత కక్ష సాధించడం లేదని అన్నారు. “కేసీఆర్‌ను జైల్లో పెట్టాలనుకుంటే ఎప్పుడో పెట్టేవాడిని. కానీ, ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమై స్వీయ శిక్ష విధించుకున్నారు. అలాంటి వ్యక్తిని జైల్లో వేయాల్సిన అవసరం నాకు లేదు” అని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఉన్నప్పటికీ కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించడం లేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వివాదంపై రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పూర్తి వివరాలతో చర్చిస్తామని సీఎం తెలిపారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి ఈ వ్యవహారంలో వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అన్నారు.

# తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా...

(మొదటి పేజీ తరువాయి)

సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాలరాయబడ్డాయన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.. బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారన్న పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. చిన్న వారికి లాభం జరగలేదని తెలిపారు. కానీ మెగా కృష్ణారెడ్డి మాత్రమే కుబేరుడు అయ్యాడంటూ వ్యంగ్యంగా అన్నారు. అలాగే ఉద్యమకారులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలంటూ ప్రొఫెసర్ కోదండరాంకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత సూచించారు. ప్రో.కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల లాంటి వారి వల్లే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. అయితే రెండేళ్ళుగా ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రో.కోదండరాంను ఈ సందర్భంగా కవిత సూటిగా ప్రశ్నించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సంక్షేమ బోర్డు ప్రకటన చేయాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 25 శాతం కోటాను ఉద్యమకారుల పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైన ఆరేండ్ల తర్వాత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టారని మాజీ ఎమ్మెల్సీ కవిత అన్నారు. 1995లో వరంగల్ డిక్లరేషన్ తో మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైందని ఆమె చెప్పారు. స్వరాష్ట్ర ఉద్యమంలో మారోజు వీరన్న, గద్దర్ లాంటి వారు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ తెలంగాణ గడ్డపై విరామం లేకుండా ఒకదాని తర్వాత మరొక ఉద్యమం కొనసాగుతూనే వచ్చిందన్నారు. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పెట్టారని, నిప్పుకణికలా మండుతున్న ఉద్యమాన్ని అగ్గిరాజేసిండని అన్నారు. 2014లో తెలంగాణ తెచ్చుకున్నంక ఉద్యమకారులకు దక్కుతదని అనుకున్నమో వారికి న్యాయం జరగలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు సరైన న్యాయం జరగలేదని ఎక్కడైనా ఉద్యమకారులకు పదవులు దక్కితే వారు మిగతా వారిని పురుగులను చూసినట్లు చూశారని విమర్శించారు. 'తెలంగాణ ఉద్యమ సమయంలో మనను కొట్టించారో వారు సార్ పక్కనే చేరిండ్రు.. కేశవరావు జాదవ్ చనిపోతే ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయా.. జయశంకర్ బొమ్మ కేబీఆర్ పార్కు వద్ద పెట్టాలని నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ను పదే పదే అడిగిన.. సుప్రీంకోర్టు తీర్పు అడ్డొచ్చింది.. ట్యాంకు బండ్ మీద పెడతామన్న పెట్టుకోలేక పోయినం.. అక్కడున్న ఆంధ్రోళ్ల విగ్రహాలు తీస్తరని అనుకున్నం... తీయకపోతివి.. కనీసం మనోళ్ల విగ్రహాలైన పేట్టకపోతివి.. ఆ బాధ వెంటాడుతూనే ఉన్నది. ఇప్పుడొచ్చినైన ఎవరి బొమ్మలు పెడుతుండో అర్థం కాని పరిస్థితి ఉంది. ఉద్యమానికి వ్యతిరేకంగా గన్ను పట్టుకొని తిరిగిన రేవంత్ రెడ్డిని గెలిపించుకున్నం.. ఆయనకు ఏం సోయి ఉంటది తెలంగాణ అంటే. రవీంద్ర భారతిలో గద్దర్, బిరదరాజు రామరాజు, సుద్దాల విగ్రహాలు ఉండాల్సింది... ఎవరి విగ్రహాలున్నాయి. చేతులో ఉన్నప్పుడు చేసుకోలేదు. ఇప్పుడు మన చేతులో పోరాటం తప్ప ఏమీ లేదు. ఇప్పుడు పోరాడితేనే ఉద్యమ కారులకు న్యాయం జరుగుతుంది.' అని కవిత అన్నారు. తెలంగాణలోని ప్రైవేట్ సంస్థల్లో స్తానికులకు 20 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్జడెట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును పాస్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన బండ్ల గణేశ్

(మొదటి పేజీ తరువాయి)

మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, చంద్రబాబు నాలుగోసారి సీఎం కావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో 'సంకల్ప యాత్ర' పేరుతో జనవరి 19న షాద్‌నగర్‌లోని తన ఇంటి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 23 రోజుల పాటు 535 కిలోమీటర్లు నడిచి, ఫిబ్రవరి 10న తిరుమల చేరుకున్నారు. రెండు రోజుల క్రితం శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నేడు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ ను ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. పాదయాత్ర సాగిన తీరును, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని బండ్ల గణేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ గురువారం రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా, ఇటీవల తాను పూర్తి చేసిన 'సంకల్ప పాదయాత్ర' గురించి మంత్రికి బండ్ల గణేశ్ వివరంగా తెలిపారు. షాద్‌నగర్ నుంచి తిరుమల వరకు 535 కిలోమీటర్ల పాటు 23 రోజుల పాటు సాగిన తన పాదయాత్ర అనుభవాలను, దాని వెనుక ఉన్న ఉద్దేశాన్ని లోకేశ్‌తో పంచుకున్నారు. అనంతరం, శ్రీవారి దర్శనం తర్వాత స్వీకరించిన తీర్థ ప్రసాదాన్ని లోకేశ్‌కు అందజేశారు. ఇరువురు నేతలు పలు అంశాలపై హృద్యంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. అంతకుముందు బండ్ల గణేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిశారు. ఏపీ అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ఈ సమావేశం జరిగింది. చంద్రబాబు జైలు నుంచి విడుదల కావాలని తాను మొక్కుకున్న మొక్కును తీర్చుకోవడానికే ఈ పాదయాత్ర చేపట్టానని బండ్ల గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఆయన్ను ఆత్మీయంగా పలకరించి, పాదయాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. బండ్ల గణేశ్ అందించిన తిరుమల ప్రసాదాన్ని స్వీకరించారు.

# నాపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గను

(మొదటి పేజీ తరువాయి)

ట్రేడ్ ద్వారా ప్రధాని మోదీ దేశాన్ని, రైతులను అమ్మేశారని ఆరోపించారు. ఈ క్రమంలో మోదీని రైతు వ్యతిరేకిగా అభివర్ణించారు. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతుల్లో నరేంద్ర మోదీ పగ్గాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో తాను మాట్లాడిన ఓ వీడియోను రాహుల్ పోస్టు చేశారు.రైతుల జీవనోపాధిని హరించే లేదా దేశ ఆహార భద్రతను బలహీనపరిచే ఏ వాణిజ్య ఒప్పందం అయినా అన్నదాతలకు వ్యతిరేకమే. రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఆహార సరఫరాదారుల ప్రయోజనాలపై రాజీ పడనివ్వం. నిన్న(బుధవారం) నేను పార్లమెంటులో నిజం మాట్లాడాను. మీకు (ప్రభుత్వానికి) నచ్చకపోతే అది వేరే విషయం. దేశం సత్యాన్ని అర్థం చేసుకోగలదు. నేను రైతులపక్షాన నిలబడతాను. అస్సలు వెనక్కి తగ్గను. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ, నేను రైతులకు అండగా ఉంటాం. వారిని అన్యాయం జరగనివ్వమని అన్నారు. రైతులే దేశానికి పునాది అని రాహుల్ గాంధీ తెలిపారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ప్రధాని మోదీ దేశంలోని పత్తి, సోయాబీన్స్, యాపిల్, పండ్ల రైతులను అమ్మేశారని ఆరోపించారు. కొన్నేళ్లుగా విదేశీయులు దేశ వ్యవసాయ మార్కెట్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వారికి నరేంద్ర మోదీ ఈ ట్రేడ్ డీల్ ద్వారా ద్వారాలు తెరిచారని మండిపడ్డారు. ఇది నిజమని, ఈ విషయం మోదీకి కూడా తెలుసని విమర్శించారు. మోదీ తన మిత్రులైన అదానీ, అంబానీ, విదేశీ శక్తుల కోసం మొత్తం దేశ వ్యవసాయ మార్కెట్‌కు తలుపులు తెరుస్తారని ఆరోపించారు. మోదీ రైతు వ్యతిరేకి అని ఈ విషయం యావత్ దేశానికి, అన్నదాతలకు తెలుసని పేర్కొన్నారు.విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్ ద్వారాలు తెరవడం దేశ ఆహార భద్రత, రైతుల జీవనోపాధిపై చేసిన ప్రత్యక్ష దాడిగా రాహుల్ అభివర్ణించారు. పత్తి, సోయాబీన్స్, జొన్నలు, పండ్ల రైతులు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారన్నారు. దేశంలోని 99.5 శాతం మంది పేద, సన్నకారు రైతులే ఉన్నారని వెల్లడించారు. వారు పండించే పంటలకు మద్దతు ధర ఉండదని, సబ్సిడీలు కూడా అందవని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. అమెరికాలో వ్యవసాయం యంత్రాలను ఉపయోగించి చేస్తారని, వారికి ప్రభుత్వం భారీ సబ్సిడీలను అందిస్తుందన్నారు.

# నేడే మున్సి'పోల్' ఎన్నికల ఫలితాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :**

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు నేడు వెల్లడి కానుంది. ఉదయం 8 గంటల 123 కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీల్లో 28 లక్షల 4వేల 274 ఓట్లు 7 కార్పొరేషన్లలో లక్ష 5 వేల 132 ఓట్లు లెక్కించాల్సి ఉంది. స్ట్రాంగ్ రూముల్లో 16 వేల 31 బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను భద్రపరిచారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియ, ఫలితాల వెల్లడికి సంబంధించిన మార్గదర్శకాలపై అధికారులకి రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లు లెక్కిస్తారు. పోలింగ్ కేంద్రం వారీగా 25 బ్యాలెట్ పత్రాలని ఒక బండిల్‌గా చేసి లెక్కింపు చేపట్టనున్నారు. ఒక్కో రౌండ్‌కు 40 కట్టలు అంటే వెయ్యి ఓట్లను కౌంటింగ్ టేబుల్‌కు పంపిస్తారు. ఓట్లను ఏజెంట్లకు చూపించి అభ్యర్థుల వారీగా ట్రేలో వేస్తారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 100 చొప్పున బండిల్ చేస్తారు. రౌండ్లు, టేబుళ్ల వారీగా అభ్యర్థులు నోటా, చెల్లని ఓట్ల వివరాలు నమోదు చేసి చివరకి ఫలితాలు ప్రకటించనున్నారు.ఓట్ల లెక్కింపు కోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లని రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇచ్చింది.చౌటుప్పల్‌తో పాటు చండూరు, జిన్నారం, పోచంపల్లి మున్సిపాలిటీల్లో 90 శాతానికిపైగా ఓటర్లు ఓటు వేశారు. 46 మున్సిపాలిటీల్లో 80 శాతం, 51 మున్సిపాలిటీల్లో 70 శాతం, 15 మున్సిపాలిటీల్లో 60 శాతం దాటింది.రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లోని 2 వేల 582 వార్డుల్లో 13 లక్షల 61 వేల 285 మంది పురుషులు, 14 లక్షల 42 వేల 751 మంది మహిళలు, 238 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. ఏడు కార్పొరేషన్లలో 4 లక్షల 90 వేల 544 మంది పురుషులు, 5 లక్షల 14 వేల 475 మంది మహిళలు, 113 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. పోలింగ్ సరళిని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీ రాణికుముదిని, సీడీఎంఏ కార్యాలయంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి టీకే శ్రీదేవి నిరంతరం పర్యవేక్షించి, క్షేత్రస్థాయిలో అవసరమైన విషయాలను ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పూర్తయిందని ఊపిరి పీల్చుకున్న రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులు తమకు ఎన్ని ఓట్లు పడ్డాయోనని అంచనా వేసుకుంటున్నారు.

# భారత్ బంద్ సక్సెస్..

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని నిరసనకారులు డిమాండు చేశారు. ఈ చట్టాలు కార్మికుల హక్కులను బలహీనపరిచాయని, ఉద్యోగ భద్రతను తగ్గించాయని, ఉద్యోగ నియామకాలు, ఉద్వాసనలను యాజమాన్యాలకు సులభతరం చేశాయని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.ఎంజీనరేగాను పునరుద్ధరించాలని, వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్(గ్రామీణ్)ని రద్దు చేయాలని కూడా నిరసనకారులు డిమాండు చేశారు. ముసాయిదా విత్తన బిల్లు, విద్యుత్తు సవరణ బిల్లు, అణు ఇంధనానికి సంబంధించిన శాంతి చట్టాన్ని రద్దు చేయాలని కూడా కార్మిక సంఘాలు డిమాండు చేశాయి.

అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, ఒడిశా, బీహార్‌లో సమ్మె విజయవంతమైనట్లు తమకు సమాచారం అందిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ గురువారం తెలిపారు. బ్యాంకింగ్, బీమా, పోస్టల్, రవాణా, ఆరోగ్య, బొగ్గు, బొగ్గేతర గనులు, గ్యాస్ పైప్‌లైన్, విద్యుత్తు రంగాల్లో సమ్మె ప్రభావం ఉందని ఆమె చెప్పారు. సమ్మె కారణంగా భువనేశ్వర్, కటక్, రూర్కెలా వంటి నగరాల్లో రవాణా సర్వీసులు నిలిచిపోయాయి.

# మామునూరు ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించండి

(మొదటి పేజీ తరువాయి)

మామూనూరు విమానా శ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించి నందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ఒక సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సిఎం వెంట ఎంపిలు కడియం కావ్య, మల్లు రవి తదితరులు ఉన్నారు.

# సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు , సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ , భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

# ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది గులాబీ జెండాయే

(మొదటి పేజీ తరువాయి)

నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

# పంచాయితీలకు మరో రూ.387 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

## ● నిర్మాణాలు కూల్చివేస్తుండగా అడ్డుకున్న స్థానికులు



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :**

హైదరాబాద్‌లోని మాదాపూర్ ఖానామెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 55లో రోడ్డుపై ఉన్న దుకాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇక్కడి అర్ధనారీశ్వర ఆలయం సమీపంలోని నిర్మాణాలను కూల్చివేస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిర్మాణాలపై స్టేటస్ కో ఉందని అయినప్పటికీ హైడ్రా అధికారులు కూల్చివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపట్టారని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్డు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

TO-DAY TELANGANA
Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక
నిజం మా నైజం


# మేడారం హుండీల లెక్కింపు పూర్తి - రూ.40 కోట్లు అంచనా

**మేడారం :** మహా జాతర హుండీల లెక్కింపు ముగిసింది. ఈ నెల 5వ తేదీ నుంచి హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో హుండీల లెక్కింపు ప్రారంభించారు. వారం రోజుల పాటు మొత్తం 828 హుండీలను లెక్కించగా, బుధవారంతో లెక్కింపు పూర్తైంది. మొత్తం రూ.13,25,83,269 ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. ఎండోమెంట్? శాఖ అధికారుల పర్యవేక్షణలో 400 మంది సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. హుండీల్లో విదేశీ కరెన్సీ, రద్దు చేసిన నోట్లు, వెండి, బంగారు ఆభరణాలు ఉన్నాయి.అదనంగా హుండీలు ఏర్పాటు చేసినా : 2024 జాతరలో రూ.13,25,22,511 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడా అంతే మొత్తం రావడం విశేషం. అయితే గత జాతరలో 540 హుండీలను ఏర్పాటు చేయగా, ఈసారి ఏకంగా 828 హుండీలను ఏర్పాటు చేశారు. అంటే దాదాపు 288 హుండీలను అదనంగా ఏర్పాటు చేసినప్పటికీ గత జాతరతో సమానంగా ఆదాయం లభించింది. దీంతో ఈసారి ఆదాయం తగ్గిందని అధికారులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో వచ్చిన బియ్యం తూకం వేసి టెండర్? ద్వారా విక్రయిస్తారు.లెక్కింపు ప్రక్రియలో 500ల మంది సభ్యులు : మేడారం జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తమ కానుకలు సమర్పించుకుని



మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల చెంత 588 హుండీలు, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల చెంత 152 చొప్పున, ఇంకా వడి బియ్యం కోసం కొన్ని, తిరుగు వారం కోసం మరికొన్ని మొత్తంగా 828 హుండీలను ఏర్పాటు చేశారు. ఈ లెక్కింపు ప్రక్రియలో దేవాదాయ శాఖ సిబ్బంది, సేవా సమితి నుంచి 500 మంది సభ్యులు పాల్గొన్నారు. లెక్కింపులో ఎలాంటి భంగం కలగకుండా దీనికోసం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.హుండీ ఆదాయంలో రూ.కోట్లలో అమ్మవారి కానుకలు : సమక్క సారలమ్మ మేడారం జాతర సందర్భంగా వచ్చే కానుకలు మొదట్లో రూ.వేలు, ఆ తర్వాత అది రూ.లక్షల్లోకి చేరి, క్రమంగా రూ.కోట్లకు చేరుకుంది. 2018 సంవత్సరంలో రూ.8.14 కోట్లు, 2020లో రూ.9.87 కోట్లు, 2022లో రూ.12.45 కోట్ల ఆదాయం వచ్చిందని దేవాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. 2024 మేడారం జాతరలో రూ.13 కోట్ల మేర ఆదాయం లభించింది. ఈసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాతరకు భక్తులు పోటెత్తినందున ఆదాయం కూడా గతేడాది కంటే 3 రెట్లు పెరుగుతుందని ప్రభుత్వ యంత్రాంగం భావించింది. ఈసారి ఎక్కువ హుండీలు ఏర్పాటు చేయడంతో సుమారు రూ.40 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, లెక్కింపు పూర్తయ్యేసరికి అటూఇటుగా గత సంవత్సం ంతో సమానంగా ఆదాయం రావడం విశేషం.అమ్మవార్ల గద్దెలను దరించుకున్న భక్తులు : ఈ మేడారం మహా జాతర ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో జనవరి 28 నుంచి 31 వరకు అంగరంగ వైభవంగా జరిగింది. ఆ నాలుగు రోజుల పాటు అక్కడి పరిసరాల్లో ఎంతో సందడి నెలకొంది. రెండేళ్లకు ఒకసారి రావడంతో జాతర నెల రోజుల ముందు నుంచే భక్తుల తాకిడి భారీ సంఖ్యలో పెరిగింది. ఇప్పటికి జాతర ముగిసి 10 రోజులు గడుస్తున్నాయి. అయినా కూడా భక్తులు వచ్చి అమ్మవార్ల గద్దెలను దర్శించుకుంటూనే ఉన్నారు.

# హైదరాబాద్‌లో మరో భారీ మోసం




**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** హైదరాబాద్‌లో మరో భారీ మోసం వెలుగు చూసింది. ఇన్‌వాయిస్ పేరుతో భారీ మోసం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారు. దాంతో తీగ లాగితే డొంకంతా కదిలింది. వాణిజ్య పన్నుల శాఖ అధికారుల చేతివాటంతో దాదాపు రూ.32 కోట్ల మేర మోసం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.సుమారు రూ.75 కోట్లకు పైగా సరకులను ఇన్‌వాయిస్ లేకుండానే వాహనాల్లో తరలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దాంతో ఈ కేసు దర్యాప్తును సీసీఎస్‌కు హైదరాబాద్ పోలీసులు అప్పగించారు. దీనిప సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎప్పటిలాగానే సాధారణ వాహనాల తనిఖీలను పోలీసులు చేపట్టారు. దీంతో అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి.

# హైదరాబాద్‌లో యుబిఎస్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్. కొత్తగా 3 వేల మందికి ఉద్యోగాలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరం పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టాయి. దేశ, విదేశాలకు తమ సంస్థల కార్యకలపాలను కొనసాగిస్తున్నాయి. తాజాగా.. స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ పెట్టుబడి బ్యాంకు, ఆర్థిక సేవల సంస్థ యూబీఎస్ తమ కంపెనీని విస్తరించింది. గచ్చిబౌలిలో అత్యాధునిక హంగులతో నూతన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను బుధవారం (ఫిబ్రవరి 11) ప్రారంభించింది. ఈ విస్తరణ ద్వారా వచ్చే రెండేళ్లలో దాదాపు 3 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.ఈ కొత్త కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుతో అత్యున్నత స్థాయి ఫైనాన్షియల్ టెక్నాలజీ, జీసీసీ కార్యకలాపాలకు హైదరాబాద్ నగరం ఒక ప్రపంచ స్థాయి కేంద్రంగా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుందని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ప్రస్తుతం తమ సంస్థకు నవీ ముంబయి, పుణె, హైదరాబాద్‌లలో కార్యాలయాలున్నాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇలాంటి



రంగాల్లో పనిచేయడానికి హైదరాబాద్‌లోని ఈ కొత్త కేపబిలిటీ సెంటర్ అదనపు వేదికను కల్పిస్తుందని కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు.ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆర్థిక సంస్థలకు హైదరాబాద్ నగరం ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందని అన్నారు. యూబీఎస్ ఇక్కడ కార్యకలాపాలను మరింత విస్తరించడం.. గ్లోబల్ టాలెంట్, ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్ నగరంపై ఉన్న విశ్వసనీయతను ప్రతిబింబిస్తో ందని తెలిపారు. జీసీసీల కోసం తెలంగాణ బలమైన ఎకో సిస్టమ్‌ను నిర్మిస్తోందని చెప్పారు. తమ ప్రభుత్వ విధానాలు, స్థిరత్వంపై అంతర్జాతీయ పరిశ్రమలకు ఉన్న నమ్మకానికి ఈ సెంటర్ విస్తరణ నిదర్శనమని వెల్లడించారు.ఈ విస్తరణను తాము దీర్ఘకాలిక వృద్ధి భాగస్వామ్యంగా చూస్తున్నామని శ్రీధర్ బాబు తెలిపారు. ఇది గ్లోబల్ ఇన్నోవేషన్‌లో హైదరాబాద్ నగర పాత్రను బలోపేతం చేయడమే కాకుండా.. భారత్-స్విట్జర్లాండ్, ఈయూ దేశాల మధ్య ఆర్థిక సంబంధాలకు దోహదపడుతుందని అన్నారు. యూబీఎస్ రాకతో ప్రపంచంలోని టాప్-10 అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు హైదరాబాద్‌లో తమ ఉనికిని చాటుకున్నట్లయిందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు

# జగ్గారెడ్డి, ఎంపి అరవింద్‌పై కేసులు నమోదు చేయాలి




**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున బీఆర్ఎస్ కార్యకర్తలపై , పోలీసు అధికారులపై అనుచితంగా, అసభ్యకరంగా దుర్భాషలాడిన కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేసి( అరెస్టు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సైఫాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అదనపు డీజీపీకి ఒక వినతి పత్రాన్ని అందజేశారు.మిర్యాలగూడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి , నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అరవింద్, మిగతాచోట్ల దాడికి పాల్పడ్డ కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయాలని, వారిపై పీడీయాక్ట్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అబ్బాస్, మాజీద్ అనే ఇద్దరు రౌడీషీటర్లను వెంట బెట్టుకుని మిర్యాలగూడలో పోలింగ్ కేంద్రం వద్ద సీఐ శివకుమార్ యాదవ్‌ను ఘోరంగా అవమాన పరిచాడని, రాష్ట్రపతి అవార్డు గ్రహిత అయిన సీఐపై నానా దుర్భాషలాడరని ఆరోపించారు.రేవంత్ రెడ్డి అండతోనే కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో పోలీసు శాఖ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నైని బొగ్గు గని విషయంలో విలేకరులను ఆగమేఘాల మీద అరెస్టు చేయించిన రేవంత్ రెడ్డి పోలీసులను దూషించిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, రౌడీషీటర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జగ్గారెడ్డి మీద సూమోటో కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ పాలనలో 89 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అతలంకుతలం అవుతుందని విమర్శించారు. శుక్రవారం మున్సిపల్ కౌంటింగ్ రోజున కాంగ్రెస్ నాయకులు అక్రమాలకు పాల్పడేందుకు కౌంటింగ్ ఏజెంట్లను, బీఆర్ఎస్ అభ్యర్థులను కిడ్నాప్ చేసే అవకాశం ఉందని బీఆర్ఎస్ నాయకులకు అభ్యర్థులకు భద్రత కల్పించాలని పోలీసులను కోరినట్లు ఆయన వెల్లడించారు.కేసీఆర్ హయాంలో పోలీసులపై ఏనాడు కూడా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసభ్యకరంగా మాట్లాడలేదని పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు వాహనాల ఏర్పాటు, ప్రపంచ స్థాయి సౌకర్యాలు , రూ.7 వందల కోట్లతో కమాండ్ కంట్రోల్ రూం, 10లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసు శాఖ ప్రతిష్టను పెంచారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి మాత్రం కుట్రతో సిట్‌ల మీద సిట్లను ఏర్పాటు చేసి పోలీసులపైనే దాడులను చేయిస్తున్నారని మండిపడ్డారు.

# నేను చేసిన పనితో ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయ్

**హైదరాబాద్ :** నైనీ బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారం తెలంగాణ రాజకీ యాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ అంశ ంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం గతంలో సింగరేణి సంస్థకు కేటా యించింది. ఈ గని నుంచి బొగ్గును వెలికితీసే బాధ్యతను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించే ప్రక్రియలో అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా.. తక్కువ ధరకు టెండర్ వేసిన వారిని కాదని నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రముఖ సంస్థకు కాంట్రాక్ట్ కట్టబెట్టారని దీనివల్ల సింగరేణికి వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు.ఈ వ్యవహారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి, ఓ మీడియా ఛానెల్ యజమాని అల్లుడు, మంత్రి కోమటిరెడ్డి పేర్లు ప్రధానంగా తెరపైకి వచ్చాయి. మంత్రులు వారి వ్యాపార భాగస్వాములకు లబ్ధి చేకూర్చేందుకు టెండర్ నిబంధనలను మార్చారని, సైటి విజిటింగ్ సర్టిఫికేట్ విషయంలోని అవకతవకలు జరిగాయని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఘాటుగా ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండద



ండలతోనే ఈ ప్రక్రియ జరిగిందని వారి వాదన. ఆ తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. తాను ఏ తప్పు చేయలేదని కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారంటూ కౌంటర్ ఇచ్చారు. ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నైనీ బ్లాక్ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.తాజాగా.. ఈ ఇష్యూపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తన వల్ల ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని అన్నారు. ఈ కుంభకోణంపై ఓ యూట్యూబ్ ఛానెల్ ప్రతినిధి కోమటిరెడ్డిని ప్రశ్నించగా.. ఆయన ఈ మేరకు బదులిచ్చారు. నైనీ బ్లాక్ టెండర్లు, నాపై వచ్చిన ఆరోపణల వెనుక పెద్ద స్టోరీ ఉంది. ఓ ఛానెల్ ఓ రకంగా రాస్తే.. ఆ తర్వాతి రోజు మరో ఛానెల్, టీవీ, పేపర్ మరో రకంగా రాశాయి. ప్రజలకు కూడా అర్థమైంది. వెంకట్ రెడ్డి గారు అలాంటి వారు కాదని. వెంకట్ రెడ్డి గారి కారణంగా గవర్నమెంట్‌కు రూ.20-30 వేల కోట్లు మిగిలాయనే విషయం ప్రజలకు అర్థమైంది. నిజంగానే నేను చేసిన పనితోని ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలినయ్. నన్ను బ్లెయిమ్ చేయాలనుకుంటే అయ్యే పని కాదు.' అని వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు.ఈ వీడియోను ట్విట్టర్ ఎక్స్‌లో షేర్ చేసిన బీఆర్ఎస్.. అవినీతికి అడ్డా కాంగ్రెస్ అని ఫైర్ అయింది. సింగరేణిలో 30 వేల కోట్ల స్కామ్ జరిగింది నిజమని ఆరోపించింది. జరిగిన స్కాంను తానే అడ్డుకున్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటున్నారని దీన్నిబట్టే కాంగ్రెస్ బీజేపీ ఒక్కటిని తెలిపోయిందన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్, కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్ రెడ్డి ఇప్పటికైనా కండ్లు తెరివాలని.. దోషులను శిక్షించాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది.

# కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలి




**చండూరు, ఫిబ్రవరి 12 :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు నల్లగొండ జిల్లా నాయకుడు జెర్రిపోతుల ధనుంజయ అన్నారు. గురువారం చండూరు మండల కేంద్రంలో కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు సిఐటియు చండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలు వేగంగా అమలు చేస్తుందన్నారు. ప్రధానంగా కేంద్రం తెచ్చిన నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని, పాత చట్టాలను పునరుద్ధరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆశ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. అసంఘటిరంగ కార్మికులకు కార్మికుల సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. రైతాంగం, కార్మిక వర్గం తమ హక్కుల కోసం పోరాడుతుంటే ఇవేమీ పట్టించుకోకుండా కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. వారి లాభాల కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడాన్ని ఆయన దుయ్యబట్టారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కోడ్ లు అమలు జరిగితే కార్మికులకు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాల కోసం బేరసారాల హక్కు కోల్పోతారని, పని గంటలు విపరీతంగా పెరుగుతాయని ఆయన వ్యక్తం చేశారు.

# మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప సూసైడ్ కేసులో బిగ్ ట్విస్ట్

**మహబూబ్‌నగర్ జిల్లా :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు కొన్ని గంటల ముందు .. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప సూసైడ్ చేసుకోవడం.. తీవ్ర దుమారానికి కారణం అయింది. ఈ వ్యవహారం కాస్తా రాజకీయ రంగు పులుముకోవడంతో.. మక్తల్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఇది కాస్తా రాష్ట్ర స్థాయికి చేరుకోవడంతో.. బీజేపీ అగ్రనేతలు స్పందించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు బెదిరింపులకు పాల్పడటంతోనే మహదేవప్ప ప్రాణాలు తీసుకున్నాడని సంచలన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలోనే మహదేవప్ప మరణానికి సంబంధించి.. ఆయన సతీమణి తాజాగా చేసిన వ్యాఖ్యలతో ఈ కేసులో కీలక ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ విషయం వెలుగులోకి వచ్చినపుడు ఒక మాట మాట్లాడిన ఆమె.. తాజాగా మరో విషయం వెల్లడించడం సంచలనం రేపుతోంది.కాంగ్రెస్ బెదిరింపుల కారణంగానే మహదేవప్ప సూసైడ్ చేసుకున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్న వేళ.. తన భర్త మృతిపై మహదేవప్ప భార్య సత్యమ్మ ఒక క్లారిటీ ఇచ్చారు. ఈ క్రమంలోనే మహదేవప్ప మృతికి సంబంధించి..



ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. తన భర్త మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని సత్యమ్మ తేల్చి చెప్పారు. మక్తల్ 6వ వార్డులోని ఓటర్లు.. తన భర్తకు ఓటు వేయరు అనే భయంతోనే ఆయన క్షణికావేశంలో.. తమ ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె పోలీసులకు చేసిన ఫిర్యాదులో స్పష్టం చేసింది.ఇక తన భర్త మహదేవప్ప సూసైడ్ విషయంలో తగిన చర్య తీసుకోవాలని సత్యమ్మ పోలీసులకు విజ్ఞప్తి చేసింది. అయితే పోలీసులకు సత్యమ్మ చేసిన ఫిర్యాదుకు సంబంధించిన కాపీ ఇప్పుడు నెట్టింట్ తెగ వైరల్ అవుతోంది. మహదేవప్ప భార్య సత్యమ్మ ఫిర్యాదు ఆధారంగా 194 బీఎన్ఎస్ సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.కానీ.. మహదేవప్ప చనిపోయిన తర్వాత మీడియాతో మాట్లాడిన సత్యమ్మ.. తన భర్తకు ఫోన్?లో బెదిరింపులు వచ్చాయని.. అందుకేల్ల తీవ్ర ఒత్తిడికి గురైనట్లు చెప్పారు. అయితే ఇప్పుడు పోలీసులకు చేసిన ఫిర్యాదులో మాత్రం.. ఎన్నికల్లో ఓటమి భయంతోనే సూసైడ్ చేసుకున్నట్లు చెప్పడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది.ఇక ఈ వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర స్థాయి నేతలు మంత్రి వాకిటి శ్రీహరిపై సంచలన ఆరోపణలు చేశారు. స్వయంగా లోక్‌సభలో గుర్తు చేయడం గమనార్హం. ఇక బీజేపీ శ్రేణులు.. మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తనపై వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తనపై చేస్తున్న ఆరోపణలు రుజువైతే.. దేనికైనా సిద్ధమని తేల్చి చెప్పారు. తాను మహదేవప్పకు తాను ఎప్పుడూ ఫోన్ చేయలేదని వెల్లడించారు. కావాలంటే తన కాల్ చెక్ చేసుకోవాలని సవాల్ విసిరారు. రాజకీయాల కోసం ప్రతి పక్షాలుదిగజారి వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు.

# గ్రామ పంచాయతీలకు కేంద్రం శుభవార్త




**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.387 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి

**తొగుట, ఫిబ్రవరి 12:** తొగుట మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సిద్దిపేట జిల్లా కోశాధికారి జి భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం-2025, విబి జి-రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని, కార్మికుల్ని కట్టు బానిసలుగా చేసి పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్లకు మేలు చేస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి




కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను తెచ్చిందని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబి జి-రామ్ జీ స్కీమ్‌ను తెచ్చి రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపిందని, విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన సవరణ చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి లాంటి మరిన్ని వినాశకరమైన చట్టాలను, బిల్లులను తీసుకొచ్చి శ్రమజీవులపై దాడి చేస్తుందని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న శ్రామిక వర్గాలను మోసం చేస్తుందన్నారు.ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే రాజ్యాంగ వ్యతిరేక చర్య..కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్ల అమలుతో 40 కోట్ల సంఘటిత, అసంఘటిత కార్మికులు వారి కుటుంబాలు చితికిపొయ్యేలా, కార్పొరేట్లు లాభాలు పోగేసుకోడానికి మార్గం సుగమం చేసిందనీ, కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలోని కార్మిక చట్టాలను నియంతృత్వంగా, దౌర్జన్యపూరితంగా కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకొని మార్చి వేసిందని మండిపడ్డారు. ఇది రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే రాజ్యాంగ వ్యతిరేక చర్య అని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ "ఐఎల్ఓ" సిఫారసులను కూడా విస్మరించిందన్నారు.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# అంబటి రాంబాబుపై పీటీ వారెంట్.. కోర్టులో హాజరుపరిచిన పోలీసులు



**గుంటూరు జిల్లా, ఫిబ్రవరి 12 :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు చట్టపరమైన ఇబ్బందులు తప్పలేదు. సత్తెనపల్లి పోలీసులు గురువారం ఆయనను సత్తెనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటన వైసీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. 2023 సంక్రాంతి పండుగ సమయంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి లక్కీ డ్రా నిర్వహించారని ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అంబటి రాంబాబు సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో బలవంతంగా ప్రజలకు టికెట్లు అంటగట్టారని జనసేన నేతలు ఆరోపించారు.ప్రజలను బెదిరించి టికెట్లు కొనిపించారని, ఇది చట్టవిరుద్ధమని జనసేన నేతలు సత్తెనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సత్తెనపల్లి పోలీసులు గురువారం ఆయనని సత్తెనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. అంబటిపై ఉన్న పీటీ వారెంట్ కారణంగా పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. కోర్టులో ఆయనని హాజరుపరచడంతో, ఈ కేసులో విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# ఏపీ లిక్కర్ స్కామ్ రాజ్ కసిరెడ్డి రెగ్యులర్ బెయిల్‌కు సుప్రీంకోర్టు నిరాకరణ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఈ కేసులో రాజ్ కసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇవ్వడానికి ఉన్నతన్యాయస్థానం నిరాకరించింది. గురువారం నాడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. లిక్కర్ కుంభకోణం చాలా పెద్దదని సీజేఐ అభిప్రాయపడ్డారు.కసిరెడ్డి అడ్వైజర్ కాదు.. ఆర్కిటెక్ట్: సీజేఐఏపీ లిక్కర్ కుంభకోణంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారులు కుమ్మక్కు కాకపోతే ఇటువంటి పెద్ద కుంభకోణాలు జరగవని అన్నారు. కుంభకోణంలో పాత్ర వహించిన అధికారులను అరెస్ట్ చేయకపోవడం దురదృష్టకరమని చెప్పుకొచ్చారు. లిక్కర్ కుంభకోణం చాలా పెద్దదని సీజేఐ అభిప్రాయపడ్డారు. కసిరెడ్డి అడ్వైజర్ కాదని.. ఈ కుంభకోణానికి ఆర్కిటెక్ట్(రూపకర్త) అని అన్నారు. ఈ కుంభకోణంలో చాలామంది లబ్ధిదారులు ఉన్నా కసిరెడ్డి మాత్రం ప్రధాన సూత్రదారుడని సీజేఐ వెల్లడించారు. నిర్ణయం తీసుకునే పదవిలో ఉన్నవారి ప్రోద్బలం లేకుండా అధికారులు ఇలా విచ్చలవిడిగా వ్యవహరించే అవకాశం లేదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.గతంలో ఏపీ హైకోర్టు.. కసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. దానిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు కసిరెడ్డి. ఇక్కడ కూడా ఆయనకు ఊరట దక్కలేదు. రెగ్యులర్ బెయిల్ ఇవ్వడానికి సుప్రీం నిరాకరించడంతో కసిరెడ్డి తరపు లాయర్లు.. పిటీషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ రాజ్ కసిరెడ్డి ఇప్పటికే 9 నెలలకు పైగా జైల్లో ఉన్న విషయం తెలిసిందే.

# ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయ ప్రసాదంలో కల్తీ



**ఏలూరు జిల్లా, ఫిబ్రవరి 12 :** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల (చిన్న వెంకన్న) ఆలయంలో ప్రసాదాల తయారీలో కల్తీ జరిగిందని సిట్ లనివేదికలో ప్రస్తావించింది. సిట్ నివేదిక వెల్లడించడంతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. స్వామివారికి ఎంతో పవిత్రంగా భావించి సమర్పించే ప్రసాదాల్లో కల్తీ నెయ్యి వాడినట్లు తేలడంపై భక్తుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. నివేదికలోని ముఖ్యాంశాలు..ద్వారకా తిరుమల ఆలయ వ్యవహారాలపై దర్యాప్తు జరిపిన సిట్, తమ నివేదికలో దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది. 2022 నుంచి 2024 మధ్య కాలంలో ఆలయానికి కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది. ఈ కాలంలో ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యిని తిరుపతికి చెందిన వినాయక ఏజెన్సీ సరఫరా చేసినట్లు సిట్ గుర్తించింది. చిన్న వెంకన్న ఆలయంలో లడ్డూ, చక్కెర పొంగలి, స్వామివారి ఇతర కైంకర్యాలకు నెలకు సుమారు 15 వేల కేజీల నెయ్యి వినియోగిస్తారు.స్వామివారి ప్రసాదంలో కల్తీ జరగడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారి ప్రసాదాన్ని పవిత్రంగా భావించి స్వీకరిస్తామని భక్తులు చెబుతున్నారు. ఇన్నాళ్లూ కల్తీ నెయ్యిని ఎలా గుర్తించలేకపోయారని, అధికారుల పర్యవేక్షణ లోపం దీనికి కారణమని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ద్వారకా తిరుమల ఆలయ కల్తీ వివాదంపై సిట్ నివేదిక సంచలనం సృష్టించగా, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

# ఘోర అగ్నిప్రమాదం సర్వం కోల్పోయిన బాధితులు



**అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఫిబ్రవరి 12:** మామిడికుదురు మండలంలోని ఆల్ క్యాస్ట్ కాలనీలో (గురువారం) భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 11 తాటాకు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదం వల్ల 13 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మరికొన్ని ఇళ్లకు మంటలు వ్యాపించకుండా త్వరితగతినే మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో 13 కుటుంబాలకు చెందిన విలువైన గృహోపకరణాలు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఓ వ్యక్తి గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రస్తుతం ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పరిహారం, పునరావాసం కోసం సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

# శ్వేత విప్లవంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆదర్శం



**కృష్ణాజిల్లా, ఫిబ్రవరి 12 :** శ్వేతవిప్లవంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆదర్శంగా నిలిచిందని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వ్యాఖ్యానించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ మరో హరిత విప్లవం తీసుకురా బోతోందని చెప్పుకొచ్చారు. డెయిరీ, ఆగ్రో కార్యక్రమాలని రెండింటినీ కృష్ణా మిల్క్ యూనియన్ సమ్మిళితం చేయబోతోందని వివరించారు. మన ప్రాంతాల్లో పండిన పంటలకు సరైన ధర వచ్చేలా చేసే బాధ్యతను కృష్ణా మిల్క్ యూనియన్ తీసుకుంటుందని తెలిపారు.ఇది ఇతరులకు ఆదర్శం కావాలని చినజీయర్ స్వామి మార్గనిర్దేశం చేశారు. కృష్ణాజిల్లాలోని వీరవల్లిలో చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో గురువారం సుఫల రైతు యాత్ర కార్యక్రమం జరిగింది. వీరవల్లి కృష్ణ మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో చినజీయర్ స్వామి ముఖాముఖి నిర్వహించారు. మన నెల, మన ఆరోగ్యం, భూ పరిరక్షణ, ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా సేంద్రీయ పద్ధతుల ద్వారా జన ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ సాగుదారులతో చినజీయర్ స్వామి ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా చినజీయర్ స్వామి ప్రసంగించారు. ఆర్గానిక్ పద్ధతి లో పంటలు పండించే రైతులకు కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సహకరిస్తున్నారని తెలిపారు. జాతీయ పాడి రైతు అభివృద్ధి సంస్థ సహకారం అవసరమని చెప్పుకొచ్చారు. ఎరువులు, పురుగుల మందులు వాడకుండా ఆయా పంటలను పండించాలని సూచించారు. ఈ పంటలకు మార్కెటింగ్ భరోసాను కృష్ణ మిల్క్ యూనియన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని.. ఇలాంటి భరోసా ప్రభుత్వాలు కూడా ఇవ్వాలని కోరారు. ఇందువల్ల కొంత ఇబ్బంది ఉంటుందని అన్నారు. పంట నాణ్యత ఆధారంగానే విలువ ఉంటుందని.. మంచి ధర వస్తుందని తెలిపారు. కృష్ణా జిల్లాలో ప్రారంభిస్తున్న ఈ కార్యక్రమం ఇతర చోట్లకు ఆదర్శంగా నిలుస్తుందని చినజీయర్ స్వామి పేర్కొన్నారు.

# చంద్రబాబు కుటుంబసభ్యుల ప్రతిభపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే



**అమరావతి, ఫిబ్రవరి 12:** ఏపీ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి జనసేన పార్టీ తరఫున ధన్యవాదాలు తెలిపే సందర్భంగా ఆ పార్టీ నేత, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేయాలన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇస్తే ఆంధ్రులకు, తెలుగు జాతికి గౌరవం చేకూరినట్టు అవుతుందని అన్నారు. దీనిపై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అసెంబ్లీని ఎమ్మెల్యే కోరారు.చంద్రబాబు కుటుంబసభ్యుల ప్రతిభపై.అలాగే, చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యుల ప్రతిభను ప్రత్యేకంగా ప్రస్తావించారు ఎమ్మెల్యే. మంత్రి నారా లోకేశ్ కుమారుడు నారా దేవాన్ష్ చెస్ రంగంలో అద్భుత సాధన చేశారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా రికార్డు సృష్టించారని తెలిపారు. 9 చెస్ బోర్డులపై 32 పాన్‌లను 5 నిమిషాల్లో దేవాన్ష్ సాల్వ్ చేసి రికార్డు నెలకొల్పారని ఎమ్మెల్యే అన్నారు. అలాగే, నారా భువనేశ్వరికి 2025లో 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు'ను ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఇచ్చిందని అన్నారు. నారా బ్రహ్మణికి గోల్డెన్ పీకాక్ ఎక్సలెన్స్ అవార్డు, మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ ఇండియా, యూకే కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డులు లభించాయన్నారు. ఈ అవార్డులు నారా కుటుంబ సభ్యుల ప్రతిభకు అద్దం పడుతున్నాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.త్రిపుల్ ఇంజిన్ సర్కార్..రాష్ట్రం.. 25 శాతం పెట్టుబడులతో పాటు దేశ గ్రోత్ రేటును అధిగమించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల మధ్య సమన్వయంతో 'త్రిపుల్ ఇంజిన్ సర్కార్'గా పనిచేస్తోందని కొనియాడారు. విద్యుత్ చార్జీల తగ్గింపు, బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వంటివి రాష్ట్రానికి గౌరవం తెచ్చాయన్నారు. విశాఖపట్నంలో సుమారు 5-6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాట పట్టేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అత్యంత తక్కువ ఖర్చుతో రూ.5000 కోట్లతో 30 లక్షల ఎకరాలు సాగులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 12 వేల కోట్లతో 4 వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి జనసేన తరఫున ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

# అమరావతి రాజధాని కాదు ఆంధ్రప్రజల భవిష్యత్: ఎమ్మెల్యే వెంకట్రాజు




**అమరావతి, ఫిబ్రవరి 12:** ఏపీ శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభమైంది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఈ చర్చను ప్రారంభించారు. ఈ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి 20 నెలలు అయిన సందర్భంగా, గవర్నర్ తన ప్రసంగంలో ప్రభుత్వ లక్ష్యాలు, విజయాలను ప్రస్తావించారని ఆయన అన్నారు. వైసీపీ హయాంలోని 'జంగిల్ రాజ్' నుంచి రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం బయటపడేసి స్థిరత్వం తీసుకొచ్చిందని వెంకట్రాజు పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో పురోభివృద్ధి కనిపిస్తోందని తెలిపారు.అనేక రంగాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని.. తనను తాను సామాజిక సేవకుడిగా ప్రకటించుకున్నారని ఆయన చెప్పారు. ఎడారి ప్రాంతాలను కూడా ఉద్యానవనాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో విద్యా విధానం ఒడిదుడుకులు ఎదుర్కొందని.. గత ప్రభుత్వ పాలకుల వ్యవస్థల విధ్వంసం వల్ల అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు.వైసీపీ హయాంలో మహిళల భద్రత, శాంతిభద్రతలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని ఎమ్మెల్యే వెంకట్రాజు ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పేరుతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అమరావతి రాజధాని మాత్రమే కాదని.. ఆంధ్రప్రజల భవిష్యత్తు అని ఆయన అన్నారు. నదుల అనుసంధానం, సాగునీరు అందజేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు.

# ఏపీ శాసనసభ శాసనమండలి వాయిదా




**అమరావతి, ఫిబ్రవరి12:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి వాయిదా పడ్డాయి. శాసనసభ వాయిదా పడిన కొద్దిసేపటికే శాసనమండలి సైతం శుక్రవారానికి వాయిదా పడింది. గురువారం ఉదయం రెండు సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇరు సభల్లో గవర్నర్ బడ్జెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఇక శాసన మండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మంత్రి పార్థసారథి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఒకానొక దశలో ఈ ఇరువురు ఒకరిపై ఒకరు ఛాలెంజ్ చేసుకునే వరకు పరిస్థితి వెళ్లింది. దాంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో శాసన మండలి శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల ప్రారంభం వేళ ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బడ్జెట్‌పై ప్రసంగించారు. ఈ సమావేశానికి వైసీపీ ఎమ్మెల్యేలు మొత్తం 11మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో పెద్దఎత్తున వారు నినాదాలు, నిరసనలు తెలిపారు. సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వైసీపీ సభ్యులంతా వాకౌట్ చేశారు. ఇక గవర్నర్ బడ్జెట్ ప్రసంగం ముగిసిన తర్వాత.. సభ వాయిదా పడింది.గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం చర్చ జరిగింది. అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది. మరోవైపు బుధవారం నాడు అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు అనుసరించి తీరు పట్ల స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ వాళ్లకి 11 అసెంబ్లీ సీట్లు వచ్చాయని.. అసెంబ్లీకి 11వ తేదీన వచ్చారని.. కేవలం 11 నిమిషాలసేపు సభలో వారు ఉన్నారంటూ స్పీకర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు.

# టీడీపీ ఎమ్మెల్యేకు సీరియస్ వార్నింగ్ పద్ధతి మార్చుకోవాలి, ఇదే ఫైనల్ ఛాన్స్



**అమరావతి :** టీడీపీ ఎమ్మెల్యేకు పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఏపీ అసెంబ్లీ లాబీల్లో ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారు.. ఇకపై పద్ధతి మార్చుకోవాలని పల్లా ఎమ్మెల్యేకు చెప్పారు. కొంతకాలంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఎన్నికల్లో టికెట్ కోసం డబ్బులు వసూలు చేశారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాగే వాట్సాప్ స్టేటస్‌లతో సొంత పార్టీ నేతల్ని టార్గెట్ చేశారు. ఈ క్రమంలో టీడీపీ అధిష్టానం ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహంగా ఉంది.ఏపీ అసెంబ్లీ లాబీల్లో టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఎమ్మెల్యే కొలికపూడితో మాట్లాడారు. శ్రీనివాస్ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వస్తుండటంతో.. అధినేత చంద్రబాబు ఆదేశాలతో పల్లా హెచ్చరించారు. 'పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో.. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు చంద్రబాబు సిద్ధంగా లేరు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ.. ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుంది. వాట్సాప్‌లో పిచ్చి స్టేటస్‌లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారు' అంటూ పల్లా శ్రీనివాస్ కొలికపూడిని ప్రశ్నించారట. పల్లా శ్రీనివాస్ సీరియస్‌గా చెప్పడంతో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కూడా స్పందించారు. 'నా అనుభవ రాహిత్యంతో పొరపాట్లు జరుగుతున్నాయి.. నాకు సీనియర్లు మార్గనిర్దేశం చేయాలి' అని చెప్పుకొచ్చారట. ఇకపై జాగ్రత్తగా వ్యవహరిస్తానని కొలికపూడి చెప్పినట్లు తెలుస్తోంది.అమరావతి ఉద్యమంతో కొలికపూడి శ్రీనివాసరావు మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో టీడీపీ తిరువూరు టికెట్ ఇచ్చింది.. ఆయన విజయం సాధించారు. ఆ తర్వాత నుంచి ఆయన వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. సొంత పార్టీ నేతల్ని టార్గెట్ చేయడంతో అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో ఒకసారి అధిష్టానం పిలిచి మాట్లాడింది.. అయినా సరే ఆయన మాత్రం వెనక్కు తగ్గలేదు. ఎయిర్‌పోర్టులో కలవడంపై కూడా దుమారం రేగింది. అయితే ఈ ఎపిసోడ్‌పై అధిష్టానం ఆరా తీసింది. అయితే ఎయిర్‌పోర్ట్‌లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదురయ్యారని.. మర్యాదపూర్వకంగా పలకరించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. దీని వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని క్లారిటీ ఇచ్చారు. ఇలా ఎమ్మెల్యే శ్రీనివాసరావు వరుస వివాదాలతో అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది.. అందుకే పల్లా శ్రీనివాస్ కొలికపూడిని హెచ్చరించినట్లు తెలుస్తోంది. మరి ఇకపైనా ఆయన పద్ధతి మార్చుకుంటారో లేదో చూడాలి.

TO-DAY TELANGANA
Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక
నిజం మా నైజం


# స్పీకర్ ఛాంబర్‌లో కాంగ్రెస్ ఎంపీల వీరంగం

**న్యూఢిల్లీ:** పార్లమెంటులో ఇటీవల విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధాని నరేంద్ర మోదీని సభకు రావొద్దని సూచించినట్టు స్పీకర్ ఓంబిర్లా వెల్లడించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి దూసుకెళ్లి ఆయన నిందించారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియో క్లిప్‌ను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన తాజాగా షేర్ చేశారు.'ఇది కాంగ్రెస్ ఎంపీ ఒకరు చట్టవిరుద్ధంగా తీసిన వీడియో. 20 నుంచి 25 మంది కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి ప్రవేశించి ఆయనను దుర్భాషలాడారు. ప్రధాని మంత్రి నరేంద్ర మోదీపై కూడా బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. మా పార్టీ చర్చలను మాత్రమే ప్రోత్సహిస్తుంది. ఎంపీలు ఇలా బెదిరింపులకు పాల్పడటాన్ని ఎన్నడూ ప్రోత్సహించదు' అని రిజిజు ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. వీడియోలో పలువురు కాంగ్రెస్ ఎంపీలు, వీరిలో ఎక్కువ మంది మహిళా ఎంపీలు కనిపిస్తున్నారు. స్పీకర్ తన సీటులో కూర్చుని ఉండగా, ఆయన పక్కన కిరణ్ రిజిజు కూడా ఉన్నారుకాగా, గత వారంలో ఈ



ఘటన చోటుచేసుకుంది. దీనిపై రిజిజు వెంటనే మీడియాతో మాట్లాడుతూ, జరిగిన ఘటనతో స్పీకర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారని చెప్పారు. 'వాళ్లు (కాంగ్రెస్ ఎంపీలు) స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లి ఆయనను దూషించారు. సభలో స్పీకర్ రూలింగ్ ఇచ్చినప్పుడు వాళ్లు పాటించలేదు. తాను మాట్లాడేందుకు ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని రాహుల్ అంటున్నారు. అయితే స్పీకర్ అనుమతి లేకుండా సభలో ఎవరూ మాట్లాడకూడదు' అని అన్నారు. ఛాంబర్‌లో నిరసన తెలుపుతున్న ఎంపీలను ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రోత్సహించారని కూడా రిజిజు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను ప్రియాంక గాంధీ తోసిపుచ్చారు. ఎంపీలు కేవలం తమ సమస్యలను చెప్పుకున్నారని, శాంతియుతంగానే ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లలో గెలుస్తాం



**చెన్నై:** అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 200లకు పైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఘనవిజయం సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ధీమా వ్యక్తం చేశారు. తిరునల్వేలిలో తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ల డీఎంకే పాలనలో ప్రజలంతా తీవ్రంగా నష్టపోయారని, ఈ ఎన్నికల్లో పార్టీని చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. డీఎంకే చరిత్రలో వరుసగా అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని మళ్ళీ అధికారంలోకి వస్తామో రామో అని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు భయం పట్టుకుందని,అందుకే అధికారంలో భాగస్వామం గురించి మాట్లాడుతున్నారని, అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన సోదరసమానుడని చెబుతూనే అధికారంలో భాగస్వామ్యం ససేమిరా కుదరదని మెండివైఖరిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఏది ఏమైనప్పటికీ ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పా డి పళనిస్వామి (ఈపీఎస్) నేతృత్వంలోని ఎన్డీయే 200లకు పైగా సీట్లలో గెలవటం తథ్యమ ని అన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఏమాత్రం నిధులివ్వలేదని చెబుతున్న స్టాలిన్ ఆరోపణలను ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం మునుపటి యూపీఏ ప్రభుత్వం కంటే 300 రెట్లు అధికంగా అంటే సుమారు రూ.14 లక్షల కోట్ల మేరకు నిధులిచ్చిందని నయినార్ నాగేంద్రన్ అన్నారు.ఋఅఅ1.యజూస్త్రఎన్నికల నిర్వహణ కమిటీ ఏర్పాటు…బీజేపీ తరఫున తన అధ్యక్షతన ఎన్నికల నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసినట్లు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. తనతోపాటు ఆ కమిటీకి ఆర్గనైజర్‌గా పార్టీ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ పొన్ రాధాకృష్ణన్, డిప్యూటీ ఆర్గనైజర్లుగా పార్టీ రాష్ట్ర కమిటీ కోశాధికారి ఎస్ఆర్ శేఖర్, ఉపాధ్యక్షులు ఆర్ఎన్ జయప్రకాష్, ఎం. వెంకటేశన్, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి మాలా సెల్వకుమార్, రామప్రియన్ ఉన్నారని తెలిపారు.

# 'అధికారంలో వాటా తమిళనాడుకు సూట్ అవ్వదు'- కాంగ్రెస్ డిమాండ్‌పై సీఎం స్టాలిన్ క్లారిటీ

**తమిళనాడు :** తమిళనాడు రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వాటా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, డీఎంకే పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ మొదటిసారి స్పష్టమైన ప్రకటన చేశారు. తమిళనాడులో అధికార భాగస్వామ్యం అనే వాదనకు చోటు లేదని ఆయన తేల్చిచెప్పారు. ఇది కూటమిని బలహీనపరచే ప్రయత్నమని పేర్కొన్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ డీఎంకే-- కాంగ్రెస్ కూటమిలో సీట్ల పంపకం, అధికార భాగస్వామ్యం అంశాలపై చర్చలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎక్కువ సీట్లు ఇవ్వాలని కోరడంతో పాటు, ఎన్నికల తర్వాత ప్రభుత్వంలో కూడా తమకు వాటా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. అయితే ఇప్పటివరకు డీఎంకే నుంచి అధికారిక స్పందన లేకపోవడంతో కూటమి భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమయ్యాయి.అది కాంగ్రెస్‌కు బాగా తెలుసు: స్టాలిన్ ఈ నేపథ్యంలో చెన్నైలో ఓ ఆంగ్ల పత్రిక నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం స్టాలిన్ ఈ అంశంపై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ షేర్ ఇన్ పవర్ నినాదంపై మోడరేటర్ అడిగిన ప్రశ్నకు ఆయన స్పష్టంగా స్పందించారు. "అధికారంలో వాటా అనే వాదన తమిళనాడుకు సరిపోదు. ఇది డీఎంకేకి కూడా తెలుసు, కాంగ్రెస్‌కూ తెలుసు. మధ్యలో ఉన్న కొందరు కూటమిని చీల్చేందుకు చేస్తున్న కుట్రే ఈ ప్రచారం" అని స్టాలిన్



పేర్కొన్నారు.అవగాహనతోనే ముందుకు!తమిళనాడు రాజకీయాల స్వభావాన్ని గుర్తుచేస్తూ, "మా రాష్ట్రం ఎప్పటినుంచో స్వయంప్రతిపత్తి, కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఇక్కడ అధికార భాగస్వామ్యం అనే భావనకు స్థానం లేదు. కూటమిలోని మిత్రపక్షాలన్నీ దీన్ని అంగీకరించాయి" అని ఆయన స్పష్టం చేశారు. కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఖండిస్తూ, "డీఎంకే కూటమిలో ఎలాంటి సమస్యలు లేవు. అవగాహనతోనే ముందుకు సాగుతున్నాం. కాంగ్రెస్‌తో కలిసి కూటమిగా ఎన్నికలను ఎదుర్కొంటాం" అని సీఎం చెప్పారు.బడ్జెట్‌లో సున్నా- బీజేపీకి ఎన్నికల్లో సున్నాఅదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై కూడా స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. "తమిళనాడుకు కేంద్ర బడ్జెట్‌లో సున్నా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో అదే సున్నాను జాతీయ ప్రజాస్వామ్య కూటమికి ప్రజలు ఇస్తారు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర హక్కులను దెబ్బతీసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని, గవర్నర్ వ్యవస్థను రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆయన ఆరోపించారు.అవినీతి మచ్చలున్న వారిని కలుపుకుంటున్న బీజేపీ!"తమిళనాడును రాజకీయంగా బలహీనపరచడానికి కేంద్ర ప్రభుత్వం గవర్నర్‌ను ఉపయోగిస్తోంది. బీజేపీ అవినీతి మచ్చలున్న వారిని కలుపుకుని డబుల్ ఇంజిన్ పేరిట ప్రచారం చేస్తోంది" అని విమర్శించారు. బీజేపీ రాజకీయాలపై తీవ్రంగా స్పందిస్తూ, "వారు ద్వేషాన్ని పెంచాలని చూస్తున్నారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి లాభపడాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలను నాశనం చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు" అని స్టాలిన్ అన్నారు.ఉదాహరణగా అసోంను ప్రస్తావిస్తూ, "అసోంలో ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. అక్కడ బీజేపీ విడుదల చేసిన ఓ వీడియోలో ముఖ్యమంత్రి తుపాకీతో ఒక ప్రత్యేక వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్న దృశ్యాలు చూపించారు. అలాంటి దృశ్యాలు చేయడానికి వాళ్లకు ధైర్యం ఎక్కడి నుంచి వస్తోంది? ప్రజాస్వామ్య భారతదేశంలో ఇవన్నీ జరుగుతాయని ఎవరైనా ఊహించారా?" అని ప్రశ్నించారు.

# నెల్లూరులో రాకెట్ పరిశోధన కేంద్రం ప్రభుత్వంతో కీలక ఒప్పందం



**నెల్లూరు, ఫిబ్రవరి 12:** జిల్లాలోని దుత్తలూరు మండలంలో రాకెట్ పరిశోధన కేంద్రం (స్పేస్) ఏర్పాటు చేయడానికి ప్రీమియం ఎక్స్‌ప్లోజివ్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ రూ.1000 కోట్ల పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాకెట్, స్పేస్ సంబంధిత కార్యకలాపాలకు సంబంధించిన అభివృద్ధి జరగనుంది. గతంలో కేంద్రం స్థాపనకు రాచవారిపల్లి, బ్రహ్మేశ్వరం రెవెన్యూ పరిధిలోని భూములను నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు.ఈ రాకెట్ పరిశోధన కేంద్రం స్థాపనతో ఆ ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు గణనీయంగా పెరగనున్నాయి. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభించే అవకాశం ఉంది. అభివృద్ధి దిశగా ఉదయగిరి నియోజకవర్గం వేగంగా అడుగులు వేస్తోంది. పరిశ్రమల స్థాపన ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఊతం లభించనుంది.

# 'మేం ఎవరినీ దూషించలేదు'- ఎంపీలను రెచ్చగొట్టారనే ఆరోపణలను తిరస్కరించిన ప్రియాంక

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన ఘటనపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఖండించారు. తాను ఎవరినీ రెచ్చగొట్టలేదని, అలాగే దూషించలేదని స్పష్టం చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణంలో మాట్లాడుతూ ఈ మేరకు తెలిపారు.'మేం ఎవరినీ దూషించలేదు. ఒకరిద్దరు ఎంపీలు ఆవేశంలో ఉన్నారు. వారు తమ భావాలను వ్యక్తం చేశారు. నేను వారిని రెచ్చగొట్టానని రిజిజు అన్నారు. ఇది అబద్ధం. నేను నిశ్శబ్దంగా కూర్చున్నా. చివరల్లో మాత్రమే శాంతి యుతంగా కొన్ని విషయాలు చెప్పా' అని ప్రియాంక గాంధీ అన్నారు.భారత్-- యూఎస్ ఒప్పందంపై విమర్శభారత్?- అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పదంపై ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ట్రేడ్ డీల వల్ల రైతులకు భారీ నష్టాన్ని కలిగిందని తెలిపారు. అందుకే గురువారం దేశవ్యాప్తంగా కార్మిక, రైతుల సంఘాలు సమ్మె చేస్తున్నారని చెప్పారు. ఆ సమ్మెకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.ఆ చర్యలు రాహుల్?ను భయపెట్టలేవు : ప్రియాంకకాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తీసుకుంటున్న చర్యలపై గురించి ప్రియాంక గాంధీ మాట్లాడారు. రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌లు, కేసులు నమోదు



చేస్తారని ఆరోపించారు. వారు ఏదైనా చేస్తారని, కానీ ఇవేవీ రాహుల్ గాంధీని భయపెట్టవని తెలిపారు.కాంగ్రెస్ ఎంపీల వీడియోను షేర్ చేసిన రిజిజుమరోవైపు లోక్?సభ స్పీకర్? ఛాంబర్‌లోకి కాంగ్రెస్ ఎంపీ వెళ్లిన వీడియోను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఎక్‌లో షేర్ చేశారు. స్పీకర్? చాంబర్‌లోకి 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు ప్రవేశించి ఆయనను దూషించారని ఆరోపించారు. ఇది ఒక కాంగ్రెస్ ఎంపీ తీసిన వీడియో అని చెప్పారు. తమ పార్టీ చర్చలను నమ్ముతుందని భౌతికంగా బెదిరించడాన్ని అక్కడే ఉండి ఎంపీలను రెచ్చగొట్టారని ఆరోపించారు. తాను కూడా అక్కడే ఉన్నానని, స్పీకర్ చాలా దయగల వ్యక్తి అని, లేకపోతే కఠిన చర్యలు తీసుకునేవారని చెప్పారు. తమ ఎంపీలు ఎవరితోనైనా వాదనకు దిగితే తమ నాయకుడు వారిని ఆపేవారని అన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులు ఎంపీలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ నియమాలను కూడా పాటించలేదని పేర్కొన్నారు.రాహుల్‌పై ప్రివిలేజ్ నోటీసుఅలాగే రాహుల్ గాంధీపై ప్రివిలేజ్ నోటీస్ ఇవ్వనున్నట్లు కిరణ్ రిజిజు తెలిపారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై తప్పుడు, నిరాధారమైన ఆరోపణలు చేశారని విమర్శించారు. అలాగే సభను తప్పుదారి పట్టించినందుకు ఈ ప్రివిలేజ్ నోటీసు ఇస్తామని తెలిపారు. ఒక ఎంపీపై తీవ్రమైన ఆరోపణలు చేయాలని అనుకున్నప్పుడు ముందస్తు నోటీసు ఇవ్వాలని, కానీ రాహుల్ గాంధీ అలా చేయలేదని అన్నారు. 'బడ్జెట్‌పై చర్చకు విపక్షనేత రాహుల్ ఎటువంటి ఉపయోగకరమైన సహ కారం అందించలేదు. ఆయన కేవలం విచిత్రమైన ఆరోపణలు మాత్రమే చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌పై సమాధానం ఇస్తారని రాహుల్‌కు నేను చెప్పాను. ఆ సమయంలో సభలో ఉండాలని ఆయన్ను కోరాను. తన ప్రసంగం అయిన వెంటనే రాహుల్ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఒక సభ్యుడు ప్రసంగం చేసిన వెంటనే సభ నుంచి బయటకు వెళ్లకూడదనే నియమం ఉంది' అని కిరణ్ రిజిజు అన్నారు.

# 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్



**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలకమైన డిఫెన్స్ డీల్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన డీల్ ఇది. ఈ డీల్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని ఢిఫెన్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత నావికా దళం కోసం 6 పీ8ఐ విమానాలను కొనుగోలు చేసే డీల్‌ను కూడా ఆమోదించినట్టు తెలిపాయి. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు డీల్‌తో భారత వాయిసేన పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుంది.ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల ద్వితీయార్థంలో భారత్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగానే డిఫెన్స్ డీల్‌పై సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. డీల్ ప్రకారం 18 రఫేల్ జట్లను 'ఫ్లై-అవే కండిషన్'లో నేరుగా తీసుకువస్తారు. తక్కిన 96 విమానాలు ఇండియాలో అసెంబుల్ చేస్తారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబెల్ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, భారత్‌తోని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటారు. భారత వాయిసేన వద్ద ప్రస్తుతం 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

# దేశవ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాలు సమ్మె

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలు, భారత్?- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ గురువారం దేశవ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాలు సమ్మెను చేపట్టాయి. విద్యుత్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రవాణా, ఆరోగ్యం, విద్య, గ్యాస్, నీటి సరఫరా, మైనింగ్, గ్యాస్ పైప్ లైన్ వంటి రంగాలకు చెందిన కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొనగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఇప్పుడైనా మోదీ వింటారా?భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే టప్పుడు వారి గొంతును ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్?సభ ప్రతిపక్ష రాహుల్? గాంధీ ఆరోపించారు. ఇప్పుడైనా ప్రధాని నరేంద్ర మోదీ వింటారా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'ఈ రోజు దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు, రైతులు తమ హక్కుల కోసం వీధుల్లోకి వచ్చి గొంతు విప్పి నిరసన తెలుపుతున్నారు. నాలుగు లేబర్ కోడ్స్ తమ హక్కులను బలహీనపరుస్తాయని కార్మికులు భయపడుతున్నారు. వాణిజ్య



ఒప్పందాలు తమ జీవనోపాధిని దెబ్బతీస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం లేదా రద్దు చేయడం గ్రామాల చివరి ఆధారాన్ని లాక్కోవడమే. వారి భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకున్నప్పుడు వారి గొంతును పూర్తిగా విస్మరించారు. ప్రధాని మోదీ ఇప్పుడైనా వింటారా? లేక అలానే ఉంటారా? నేను కార్మికులు, రైతుల సమస్యలతో, వారి పోరాటంతో గట్టిగా నిలబడి ఉన్నా' అని రాహుల్ గాంధీ పోస్ట్?లో రాసుకొచ్చారు. దేశవ్యాప్తంగా సమ్మె కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలు, భారత్?- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూగా రైతు, కార్మిక సంఘాలు సమ్మెను చేపట్టాయి. ఈ సమ్మెలో పది కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. దీనికి సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్?కేఎం) పూర్తి మద్దతు ప్రకటించింది. దేశవ్యాప్తంగా బ్యాంకులు మూతపడ్డాయి. సమ్మెలో సుమారు 30 కోట్లమంది కార్మికులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. బ్యాంక్ యూనియన్లలో ఏఐబీఈఏ, ఏఐబీఓఏ, బీఈఎఫ్ఐలు సమ్మెలో పాల్గొంటుండగా మిగిలినవి మద్దతు తెలిపాయి. ప్రైవేటైజేషన్, విద్యుత్ సవరణ బిల్-2025, జాతీయ విద్యుత్ పాలసీ-2026ను వ్యతిరేకిస్తూ 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు దిగారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ, అవుట్ సోర్సింగ్ నిలిపివేత, రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.సమ్మెకు ప్రధాన కారణాలుభారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాలు సమ్మె చేస్తున్నాయి. వేటీకరణను ఆపాలని, కార్పొరేట్ అనుకూల సంస్కరణలను తీసుకురావొచ్చని నిరసన వ్యక్తం చేస్తున్నారు.

# చంద్రయాన్-4.. ల్యాండింగ్‌కు ఎంఎం 4నే ఇస్రో ఎందుకు ఎంచుకుంది?

**ఢిల్లీ :** జాబిల్లిపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ( ఇస్రో ) మరో మిషన్‌కు శ్రీకారం చుట్టింది. చంద్రయాన్-4 కోసం ఇస్రో కార్యాచరణ ప్రారంభించింది. చందమామ దక్షిణ ధ్రువంపై వ్యోమనౌక ల్యాండింగ్ ప్రాంతాన్ని ఇటీవల ఖరారు చేసిన సంగతి తెలిసిందే. అక్కడ నుంచి మట్టి నమూనాలను భూమికి తీసుకురావడమే లక్ష్యంగా ఇస్రో ఈ మిషన్‌ను చేపడుతుండగా.. కేంద్రం కూడా దీనికి ఆమోదం తెలిపింది. చంద్రుడిపైకి ఇస్రో ఇప్పటి వరకూ చేపట్టిన అన్ని మిషన్ల కంటే చంద్రయాన్-4 అత్యంత సంక్లిష్టమైంది. సెప్టెంబరు 2023లో చంద్రయాన్-3ను జాబిల్లి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దింపిన తర్వాత చంద్రుడిపై ప్రయోగాలకు చేపట్టబోతున్న తొలి మిషన్ ఇదే. చంద్రయాన్-3 సక్సెస్‌తో అమెరికా, చైనా, రష్యాల తర్వాత ఈ ఘనత సాధించిన దేశంగా, దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ నిలిచింది.2028 నాటికి చంద్రయాన్-4ను ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఇస్రో.. చంద్రుడిపై ఉన్న మాన్స్ మౌటన్ (ఎంఎం) వద్ద ఎంఎం-1, 3, 4, 5 అనే నాలుగు ప్రాంతాలను ల్యాండింగ్ కోసం పరిశీలించింది. వీటిలో ఎంఎం-4ను ఎంపిక చేసినట్టు ఇస్రో వెల్లడించింది. జాబిల్లి కక్ష్యలో తిరుగుతున్న చంద్రయాన్-2 ఆర్బిటర్ హై రిజల్యూషన్ కెమెరా అందించిన ఫోటోలు, సైంటిఫిక్ డేటా ఆధారంగా ఈ ప్రదేశాన్ని ఎంపిక చేసినట్లు వివరించారు.

# ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడులో జైషే మహ్మద్ హస్తం

**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ లోని ఎర్రకోట వద్ద గత ఏడాది జరిగిన బాంబు పేలుడు ఘటనపై ఐక్యరాజ్య సమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుతో పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ) ఉగ్రవాద సంస్థకు సంబంధం ఉన్నదని పేర్కొన్నది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ జైషే మహ్మద్ తదితర ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలంగా నేర కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపింది.ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలను ప్రస్తావించింది. 'ఆంక్షలు ఉన్నప్పటికీ జైషే ముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తున్నది. 2025 నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన ఆత్మాహుతి దాడి అందులో ఒకటని ఒక సభ్యదేశం ఆరోపించింది. అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గత ఏడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇది చాలా ఆందోళనకర పరిణామం' అని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో పేర్కొన్నది.జమ్ముకశ్మీర్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి ఘటనను కూడా యూఎన్‌వో తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు తెలిపింది. కాగా జైషే, లష్కరే తాయిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్థాన్ పదేపదే వాదిస్తూ వస్తున్నది. ఈ క్రమంలో తాజాగా ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాకిస్థాన్ వక్రబుద్ధి బయటపడింది.కాగా ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. చేసుకున్నారు. భారత్ అంతటా ఆత్మాహుతి దాడులకు ఈ ముఠా కుట్రలు పన్నినట్లు ఆ వీడియోలో ఉంది. దానిపై దర్యాప్తు కొనసాగుతున్నది.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# వరల్డ్‌కప్‌లో ఇటలీ తొలి విజయం



## - నేపాల్ పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం

ప్రపంచకప్‌లో పసికూన ఇటలీ సంచలనం సృష్టించింది. టీ20 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో తొలి విజయం నమోదు చేసింది. తాజాగా ముంబయి వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ 12.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు జస్టిన్ మోస్కా (60 పరుగులు), ఆంథని మోస్కా (62 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో 44 బంతులు మిగిలుండగానే ఇటలీ విజయం సాధించింది.స్వల్ప లక్ష్య ఛేదనే అయినప్పటికీ నేపాల్ ఏదైనా అద్భుతం చేస్తుందేమోనని క్రికెట్ ఫ్యాన్స్ తొలుత భావించారు. అయితే ప్రత్యర్థి నేపాల్‌కు ఇటలీ ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. తొలి నుంచే ఎడాపెడా బౌండరీలు బాదేశారు. వీళ్లిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలోనే ఇటలీ వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసింది. ఆ తర్వాత కూడా జోరు కొనసాగించిన ఓపెనర్లు చెరో హాఫ్ సెంచరీ కంప్లీట్ చేసుకున్నారు. ఈ క్రమంలోనే 10 ఓవర్లకు స్కోర్ 97కు చేరింది. ఇక 11, 12వ ఓవర్లో వరుసగా 14, 11 వచ్చాయి. ఆ తర్వాత 13వ ఓవర్లో రెండు సింగిల్స్ రావడంతో మ్యాచ్ ముగిసింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆరిఫ్ షేక్ (27 పరుగులు) టాప్ స్కోరర్. రోహిత్ పౌడెల్ (23 పరుగులు), ఆసిఫ్ షేక్ (20 పరుగులు) ఫర్వాలేదనిపించారు. గతమ్యాచ్‌లో మెరుపులు మెరిపించిన లోకేశ్ బమ్ (3 పరుగులు) తీవ్రంగా నిరాశపర్చాడు. చివర్లో కరణ్ కేసీ (18లి పరుగులు) బాదడంతో జట్టు స్కోర్ 120 దాటింది. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ 2, అలీ హసన్, జస్ప్రీత్ సింగ్, సమ్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే టోర్నీలో రీసెంట్‌గా తొలి మ్యాచ్‌లో పటిష్ఠమైన ఇంగ్లాండ్‌ను ఓడించినంతపని చేసిన నేపాల్ ఈ మ్యాచ్‌లో కనీసం పోటీ ఇవ్వకపోవడం గమనార్హం. ఆ మ్యాచ్‌లో గెలుపు అంచులదాకా వెళ్లిన పసికూన నేపాల్, ఈసారి ఇటలీని చిత్తు చేస్తుందని మ్యాచ్‌కు ముందు అంతా అనుకున్నారు. కానీ సీన్స్ రివర్స్ అయ్యింది. తొలుత బ్యాటింగ్, తర్వాత బౌలింగ్ రెండు విభాగాల్లోనూ పూర్తిగా విఫలమై వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది. ఇక ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇటలీ రెండో మ్యాచ్‌తో టోర్నీలో బోణీ కొట్టింది. అలాగే టీ20 ప్రపంచకప్‌లో 100 పరుగుల భాగస్వామ్యం చేసిన మూడో అసోసియేటెడ్ (టెస్టు హోదా లేని జట్టు) జట్టుగా ఇటలీ అరుదైన ఘనత సాధించింది. గతంలో ఒమన్ (2021), స్కాట్లాండ్ (2026) ఈ ఘనత సాధించాయి. వరల్డ్‌కప్‌లో తొలి విజయం సాధించిన ఇటలీని క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ అభినందించాడు. "టీ20 ప్రపంచకప్‌లో తొలి విజయం అందుకున్న ఇటలీకి శుభాకాంక్షలు. ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ జట్టైన ఇటలీ క్రికెట్‌లోనూ తనదైన ముద్ర వేయడం, గ్లోబల్ లెవెల్‌కు వ్యాపిస్తుందని గుర్తుచేస్తుంది" అని సచిన్ ట్వీట్ చేశాడు.



## పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు అభిషేక్ శర్మ దూరం

టీ20 ప్రపంచ కప్ 2026 భారత్ తన రెండో మ్యాచ్ ఆడుతోంది. మొదటి మ్యాచ్‌లో అమెరికాపై విజయం సాధించింది. ఇప్పుడు రెండో మ్యాచ్ నమీబియాతో తలపడుతోంది. మొదటి మ్యాచ్‌లో తొలి బంతికే అవుట్ అయిన అభిషేక్ శర్మ ఆరోగ్యం ఇప్పుడు టీమిండియాను టెన్షన్ పెడుతోంది. అభిషేక్ కడుపు సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఇప్పుడు, నమీబియాతో జరిగే రెండో మ్యాచ్ కోసం అభిషేక్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కలేదు. మ్యాచ్‌కు ముందు టాస్ సందర్భంగా, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అభిషేక్ శర్మ ఆరోగ్యం గురించి అప్‌డేట్ ఇచ్చాడు. సూర్య అప్‌డేట్ అభిమానులకు నిజంగా షాక్‌కి గురి చేసింది. పాకిస్తాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు అభిషేక్ కూడా దూరంగా ఉండవచ్చని అతను చెప్పడం ఆందోళనకలిగిస్తోంది. టాస్ తర్వాత అభిషేక్ ఆరోగ్యం గురించి అడిగిన ప్రశ్నకు సూర్యకుమార్ యాదవ్ స్పందిస్తూ, "అభిషేక్ ఇంకా బాగా లేదు. అతను ఒకటి లేదా రెండు మ్యాచ్‌లకు దూరమవుతాడు" అని అన్నారు. సూర్య ప్రకటన స్పష్టంగా అర్థం ఏమిటంటే, నమీబియా తర్వాత, పాకిస్తాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు కూడా అభిషేక్ దూరమవవచ్చు. భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఫిబ్రవరి 15 ఆదివారం శ్రీలంకలోని కొలంబోలో జరుగుతుంది. ఈ మ్యాచ్‌కు అభిషేక్ తిరిగి వస్తాడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. టోర్నమెంట్‌లో భారత్ ప్రధాన ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ. అతని స్థానంలో ఓపెనింగ్ వస్తున్న సంజూ శాంసన్ ఫామ్‌లో లేడు. ఆయన ధాటిగా ఆడటానికి పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. అయితే, అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ విఫలమయ్యాడు. ఖాతా తెరవకుండానే మొదటి బంతికే ఔటయ్యాడు. అయినప్పటికీ, పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ ఉండటం టీమ్ ఇండియాకు పెద్ద ప్రయోజనకరంగా ఉంటుంది.

## హార్దిక్ పాండ్యా రికార్డుకు గురిపెట్టిన వైభవ్ సూర్యవంశీ..



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే క్రికెట్ అభిమానులకు అసలైన మజా ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. ఒకప్పుడు హార్దిక్ పాండ్యా ఒకే ఇన్నింగ్స్‌లో 20 సిక్సర్లు బాది సృష్టించిన సునామీ గుర్తు ఉండే ఉంటుంది. ఇప్పుడు అదే టోర్నమెంట్‌లో ఈ చిచ్చరపిడుగు తన ప్రతాపం చూపించబోతున్నాడు. ఫిబ్రవరి 23 నుంచి ముంబైలో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్‌లో వైభవ్ ఆడటం దాదాపు ఖాయమైంది. డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్ అంటేనే స్టార్ ప్లేయర్లకు అడ్డా. 2020లో గాయం నుంచి కోలుకున్న తర్వాత హార్దిక్ పాండ్యా ఇదే టోర్నీలో విశ్వరూపం చూపించాడు. కేవలం 55 బంతుల్లో 20 సిక్సర్లు, 6 ఫోర్లతో 158 పరుగులు చేసి క్రికెట్ లోకాన్ని ఆశ్చర్యపరిచాడు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రెండు సెంచరీలు బాదిన పాండ్యా, అప్పట్లో ఈ టోర్నీ స్థాయిని అమాంతం పెంచేశాడు. ఇప్పుడు అదే వేదికపై వైభవ్ సూర్యవంశీ తన సత్తా చాటబోతున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ పేరు మార్మోగిపోవడానికి బలమైన కారణం ఉంది. ఇటీవల ముగిసిన అండర్-19 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు బాది సంచలనం సృష్టించాడు. ఈ ఏడాది ఇప్పటికే అండర్-19 క్రికెట్‌లో రెండు సెంచరీలు సాధించిన వైభవ్, ఇప్పుడు సీనియర్ ప్లేయర్లతో తలపడేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడనున్న వైభవ్, దానికి ముందు ఈ టోర్నీని ఒక వార్మప్ సెషన్‌గా భావిస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం.. వైభవ్ ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ ఆధ్వర్యంలో తాళేగావ్‌లో జరుగుతున్న శిక్షణా శిబిరంలో ఉన్నాడు. ఈ క్యాంప్ ఫిబ్రవరి 21న ముగియనుంది. ఆ తర్వాత తన స్వస్థలానికి వెళ్లి, తిరిగి ముంబై చేరుకుని డీవై పాటిల్ టోర్నీలో పాల్గొంటాడు.

## భారత క్రికెటర్ల వాచ్‌ల విలువ కాదు పాక్ ఆటగాళ్ల నెట్‌వర్త్..

### • షోయబ్ అక్తర్ మాట్లాడినట్లు వైరల్‌గా మారిన ట్వీట్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్-పాకిస్థాన్ హైఓల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్‌పై నెలకొన్న సందిగ్ధతకు ఐసీసీ తెరదించిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్.. ఐసీసీ ఆంక్షలకు తలొగ్గి తమ నిర్ణయాన్ని మార్చుకుంది. భద్రతా కారణాలతో టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోమని ఐసీసీ హామీ ఇవ్వడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ సిద్ధమైంది.భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్దరించాలని ఈ సందర్భంగా పీసీబీ డిమాండ్ చేయగా.. ఐసీసీ తిరస్కరించింది. తమ పరిధిలో లేని వ్యవహారమని, బీసీసీఐని ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడమని ఆదేశించలేమని స్పష్టం చేసింది. మిత్ర దేశాల విజ్ఞప్తుల నేపథ్యంలో బాయ్‌కట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ఒక ప్రకటనను విడుదల చేసింది.దాంతో ఆదివారం(ఫిబ్రవరి 15) కొలంబో వేదికగా భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. పాకిస్థాన్ బాయ్‌కాట్ డ్రామా నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొలంబో పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండటం.. పాకిస్థాన్‌లో ఐదుగురు స్పిన్నర్లు ఉండటం ఈ మ్యాచ్‌పై హైప్‌ను క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ అద్భుత ప్రదర్శన కనబరుస్తుండటంతో భారత్‌కు గట్టి పోటీ ఎదురవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సోషల్ మీడియా వేదికగా జోరుగా చర్చ జరుగుతోంది.అయితే ఈ చర్చ మధ్యలో కొన్ని ఫేక్ ట్వీట్స్, కామెంట్స్ కూడా నెటిజన్లను అయోమయానికి గురి చేస్తున్నాయి. భారత్‌తో పాకిస్థాన్ జట్టును పోల్చడం సరికాదని, భారత ఆటగాళ్ల వాచీల ధర అంత కూడా పాక్ ఆటగాళ్ల సంపాదన ఉండదని షోయబ్ అక్తర్ మాట్లాడినట్లు ఓ ఫేక్ ట్వీట్ వైరల్‌గా మారింది.భారత ఆటగాళ్లతో పాకిస్థాన్ ప్లేయర్లను అస్సలు పోల్చలేరు. మా క్రికెటర్ల నెట్‌వర్త్ భారత ఆటగాళ్లు వాడే ఖరీదైన వాచులతో సమానం.'అని షోయబ్ అక్తర్.. ఓ ప్రముఖ భారత న్యూస్ ఛానెల్‌తో అన్నట్లు ఓ ఫేక్ ట్వీట్ వైరల్‌గా మారింది. అయితే ఇందులో ఏ మాత్రం నిజం లేదు. ఈ కామెంట్స్‌ను అక్తర్ ఎక్కడా అనలేదు. పాకిస్థాన్‌పై ఉన్న కోపంతో ఓ భారత నెటిజన్ క్రియేట్ చేసిన పోస్ట్ అని ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఎక్స్ ఏఐ చాట్‌బాట్ గ్రోక్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఇది నకిలీ పోస్ట్ అని తేల్చింది. మెగా టోర్నీల్లో పాకిస్థాన్‌పై భారత్‌దే పైచేయిగా ఉంది. ఆసియా కప్ 2025 టోర్నీలో మూడు మ్యాచ్‌లకు మూడింటిలోనూ భారత్‌పై పాకిస్థాన్ ఓటమిపాలైంది.



## సూపర్-8 రేసులో వెనుకబడ్డ ఇంగ్లాండ్



టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతోంది. ప్రతి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టిక తలకిందులవుతోంది. ఫిబ్రవరి 11న జరిగిన కీలక పోరులో వెస్టిండీస్ చేతిలో ఇంగ్లాండ్ ఓడిపోవడంతో సూపర్-8 ఈక్వేషన్స్ పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్లుగా వెలిగిన ఇంగ్లాండ్ టీమ్, ఇప్పుడు తదుపరి రౌండ్‌కు చేరుతుందా లేదా అన్న ఆందోళనలో పడిపోయింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో వెస్టిండీస్ 30 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. దీంతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన వెస్టిండీస్ 4 పాయింట్లతో గ్రూప్-సిలో అగ్రస్థానంలో నిలిచింది. ఇంగ్లాండ్ పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒకటి గెలిచి, ఒకటి ఓడిపోయినప్పటికీ.. రన్ రేట్ తక్కువగా ఉండటంతో స్కాట్లాండ్ కంటే వెనుకబడి మూడో స్థానంలో ఉంది.


## 6,6,6,6,6.. 20 బంతుల్లో ఇషాన్ బీభత్సం..

టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్, తొలి ఆరు ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. తుఫాన్ ఆరంభంతో నమీబియాపై చెలరేగిపోయారు టీమిండియా బ్యాటర్లు. ఈ క్రమంలో ఇషాన్ కిషన్ మరోసారి తన బ్యాట్ ఝులిపించాడు. కేవలం 20 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 6 ఫోర్లు ఉన్నాయి. ధాటిగే ఆడే క్రమంలో ఓ భారీ షాక్ ఆడబోయి 61 పరుగులకు పెవిలియన్ చేరాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో ఇషాన్ వరుసగా నాలుగు సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టి తన అర్ధ సెంచరీని చేరుకున్నాడు. శాంసన్ 22 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఈ క్రమంలో ఇషాన్‌తోపాటు టీమిండియా పేరిట కొన్ని రికార్డులు నమోదయ్యాయి.



TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు



టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణెళిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియెస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు.నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు.హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెళిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ను, వాసవి గణెళిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్–అర్జున్ సంగీతాన్ని అందించారు.



# 'యుఫోరియా'పై మహేశ్ బాబు ప్రశంసలు... క్లైమాక్స్ అద్భుతమన్న సూపర్ స్టార్

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'యుఫోరియా'పై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సినిమాను వీక్షించిన ఆయన, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.“గుణశేఖర్ గారు కథలను చెప్పే విధానంలో ఒక ప్రత్యేకమైన శైలి ఉంటుంది. సినిమాను నేను బాగా ఆస్వాదించాను, ముఖ్యంగా క్లైమాక్స్ అద్భుతంగా ఉంది. ఇది తప్పక చూడాల్సిన సినిమా“ అని మహేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దర్శకుడు గుణశేఖర్‌తో పాటు నటి భూమికా చావ్లా, నిర్మాతలు నీలిమ గుణ, యుక్త గుణ, సంగీత దర్శకుడు కాల భైరవ, నటి సారా అర్జున్ సహా మొత్తం చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక అంశాలతో కూడిన డ్రామా థ్రిల్లర్‌గా 'యుఫోరియా' తెరకెక్కింది. యువత ఎదుర్కొంటున్న డ్రగ్స్, నేరాలు, కుటుంబ సమస్యల వంటి సున్నితమైన అంశాలను ఈ చిత్రంలో చర్చించారు. భూమికా చావ్లా, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలో విడుదలైంది. ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి స్పందన లభిస్తోంది.మహేశ్ బాబు కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'ఒక్కడు' చిత్రానికి గుణశేఖర్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య మంచి స్నేహబంధం ఉంది. ఈ నేపథ్యంలో మహేశ్ నుంచి వచ్చిన ప్రశంసలు 'యుఫోరియా' చిత్ర బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

# వెంకీ అట్లూరితో నాని మూవీకి ప్లాన్



స్టార్ కథానాయకుడు నాని ప్రస్తుతం వరుస హిట్లతో జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న నాని ఆ తర్వాత సుజిత్ దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ రెండు చిత్రాలు కాకుండా మరో క్రేజీ దర్శకుడితో నాని చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వైవిధ్యమైన చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మించబోతున్నాడు. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా తర్వాత నాని ? సితార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉంది. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా 'విశ్వనాథన్ అండ్ సన్స్'చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ కమిట్‌మెంట్లు అన్నీ పూర్తయిన తర్వాత, 2026 ద్వితీయార్థంలో నాని ? వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

----------




# సుహాస్ వైవిధ్యంగా హే భగవాన్

వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సుహాస్, తాజాగా 'హే భగవాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సీనియర్ నటుడు నరేష్ తన కుటుంబ వ్యాపారాన్ని రహస్యంగా నిర్వహిస్తుంటారు. ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే నిబంధన ఉంటుంది. అయితే తన తండ్రి వ్యాపారాన్ని సుహాస్ టేకోవర్ చేద్దామనుకుంటాడు. ఈ క్రమంలో ఎదురయ్యే సంఘటనలు ఏంటి అనేది ఈ చిత్ర కథాంశం.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తర్వాత సుహాస్ మరియు శివానీ నాగారం మరోసారి జోడీ కట్టడం ఈ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు గోపీ అచ్చర ఈ చిత్రాన్ని అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించడమే కాకుండా, ÷–లకైమాక్స్‌లో ఒక మంచి ఎమోషనల్ టచ్ కూడా ఉంటుందని తెలిపారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ నిర్మించగా, బన్నీ వాస్ మరియు వంశీ నందిపాటి సంయుక్తంగా విడుదల చేస్తున్నారు.

# అప్పలసూరిగా జగపతిబాబు

ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు.




# బాలీవుడ్‌లో బెదిరింపుల కలకలం..

## రణ్‌వీర్, ఆయుష్ శర్మలకు హెచ్చరికలు



బాలీవుడ్‌లో మరోసారి బెదిరింపుల కలకలం రేగింది. ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్‌తో పాటు, సల్మాన్ ఖాన్ బావమరిది, నటుడు ఆయుష్ శర్మలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు అందాయి. కోట్లాది రూపాయలు డిమాండ్ చేస్తూ వచ్చిన ఈ హెచ్చరికలతో సినీ పరిశ్రమ ఉలిక్కిపడింది. ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ ఘటనలపై దర్యాప్తును ముమ్మరం చేశారు.రణ్‌వీర్ సింగ్‌కు చెందిన ఒక ఉద్యోగి వాట్సాప్‌కు వాయిస్ నోట్ రూపంలో బెదిరింపు సందేశం వచ్చింది. నిందితులు తమ ఆచూకీ తెలియకుండా ఉండేందుకు వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) వాడినట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు, ఆయుష్ శర్మకు అత్యంత గోప్యత కలిగిన ప్రోటాన్‌మెయిల్ ద్వారా బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. క్రిప్టోకరెన్సీ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించాలని అందులో డిమాండ్ చేశారు. ఈ ఘటనల నేపథ్యంలో రణ్‌వీర్ సింగ్ ఇంటి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.ఇటీవల దర్శకుడు రోహిత్ శెట్టి ఇంటి వద్ద జరిగిన కాల్పుల ఘటన తర్వాత బాలీవుడ్ ప్రముఖులే లక్ష్యంగా ఈ బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. రోహిత్ శెట్టి కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసి, వారిపై కఠినమైన 'మకోకా' చట్టాన్ని ప్రయోగించారు.